క్లుప్తంగా

నేటి నుంచి ధార్మిక కార్యక్రమాలు

ఓబులవారిపల్లె : హిందు ధర్మప్రచార పరిషత్ అధ్వర్యంలో కటికంవారిపల్లెలోని కృష్ణ మందిరంలో నేడు మంగళవారం నుండి ధార్మి క కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని సోమవారం కడప జిల్లా ప్రోగ్రాం అసిస్టెంట్ టి.గోపి బాబా ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణ మందిరం నిర్వాహకురాలు ఎన్నరు లీలావతమ్మ అధ్వర్యంలో ఐదురోజుల పాటు ఈ కార్యక్రమాలు ఉంటాయని తెలియజేశారు. సాయంత్రం ఆరు గంటల నుంచి ఉపన్యాసాలు, బోధనలు, భజన కార్యక్రమాలు ఉంటాయని భక్తులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు.

7న విద్యుత్ అదాలత్

లక్కిరెడ్డిపల్లె : లక్కిరెడ్డిపల్లె సబ్ డివిజన్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల సౌకర్యార్థం గురువారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏపీఎస్‌పీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో సంస్థ చైర్‌పర్సన్, రిటైర్డ్ జడ్జీ శ్రీనివాస్, ఆంజనేయ మూర్తి, ఆర్థిక సభ్యులు రామ్మోహన్ రావు, సాంకేతిక సభ్యుడు అంజన్ కుమార్, ఈశ్వరమ్మలు హాజరవుతారన్నారు. రాయచోటి సబ్ డివిజన్‌ల పరిధిలోని విద్యుత్ వినియోగదారులు విద్యుత్ శాఖలో ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా వచ్చి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అక్కడే సమస్యలను పరిష్కరించేందుకు ఈ ప్రత్యేక విద్యుత్ అదాలత్ ఉపయోగపడుతుందన్నారు.

కంటి అద్దాలు పంపిణీ


కంటి అద్దాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

ఓబులవారిపల్లె : వైఎస్సార్ పార్టీ నాయకులు, పారిశ్రామికవేత్త మల్లు ప్రసాద్‌రెడ్డి సోమవారం ముక్కావారిపల్లె టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో పేదలకు ఉచిత కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన తండ్రి మల్లు వెంకటసుబ్బారెడ్డి జ్ఞాపకార్థం చెన్నై శంకర్ నేత్రాలయం ఆధ్వర్యంలో దాదాపు రెండు వందల మంది కంటికి సంబంధించిన ఆపరేషన్‌లను ఉచితంగా నిర్వహించామన్నారు. ఇందులో 150 మందికి ఉచిత కంటి అద్దాలను సోమవారం అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో మల్లు నాగరాజు, మల్లు సుబ్బారెడ్డి, పున్నటి సుధీర్‌రెడ్డి, మల్లు విజయ్ తదితరులు పాల్గొనారు.

నేడు వేంకటేశ్వర స్వామి కల్యాణం


అలంకరణలో వేంకటేశ్వరుడి మూలమూర్తి

రామాపురం : అన్నమయ్య జిల్లా రామాపురం మండలం హసనాపురం గ్రామం యర్రంగివాండ్లపల్లె నాలుగు రోడ్ల కూడలిలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత శ్రీ ప్రసన్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణ మహోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త బండి ఆదిరెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి శ్రీవారి సుప్రభాతం, స్వామి మూలమూర్తి, ఉత్సవ మూర్తులకు అభిషేక తిరుమంజనం , అలంకారం, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా వేద పండితుల చేత నిర్వహించడంతోపాటు వచ్చిన భక్తులకు అన్నప్రసాద వినియోగం చేయనున్నట్టు నిర్వాహకులు తెలియజేశారు.

మతసామరస్యానికి ప్రతీక ఉరుసు


కడప పెద్ద దర్గా పీఠాధిపతితో కలిసి ప్రార్థనల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

చిన్నమండెం : సమైక్యతకు, మత సామరస్యానికి ప్రతీక చిన్నమండెం ఉరుసు అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం చిన్నమండెంలోని హజరత్ షా అలీ గంజే షాహీద్ బాబా రహంతుల్లా అలైహి దర్గాలో జరిగిన ఉరుసులో మైనార్టీ నాయకులతో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి సయ్యద్ షా ఆరీఫుల్లా హుస్సేని నుంచి ఆశీర్వాదం పొందారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, వైఎస్సార్‌సీపీ మదనపల్లె పరిశీలకులు హబీబుల్లా ఖాన్, వైస్ ఎంపీపీ ఏజాస్‌అలీఖాన్, సర్పంచ్ నజీర్ అహ్మద్, షారుల్లా, కోఆప్షన్ గౌస్‌సాబ్, చుక్కా అంజనప్ప, బుర్హాన్‌ఖాన్, యేహియాఖాన్, సజ్జాద్, అజ్రు, జహీర్, సాదిక్, ఖదీర్, సిబకతుల్లాఖాన్, ఎంపీటీసీ వెంకటప్పనాయుడు, సర్పంచ్ లోకేశ్వరరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, హరూన్‌బాషా, జాకీర్, ఫయాజ్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కల సాకారం

- ప్రతి ఇంటికి నవరత్నాలు చేరాయి
- వైఎస్సార్‌సీపీతోనే సంక్షేమ పాలన
- లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కొరముట్ల


ఆసుపత్రిని పరిశీలిస్తున్న విప్ కొరముట్ల


పెనగలూరులో రిజిస్ట్రేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పెనగలూరు (ఓబులవారిపల్లె): మహిళల మోముల్లో సంతోషం చూడాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయ సభా భవనంలో ఇంటి పట్టాలను మహిళలకు పంపిణీ చేసే కార్యక్రమానికి కొరముట్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో జగనన్న కాలనీల ద్వారా 698 పక్కా గృహాలు మంజూరు చేశామన్నారు. లబ్ధిదారులకు ఒకటిన్నర సెంట్ల చొప్పున ఇంటి స్థలాన్ని అందజేశామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 31 లక్షల మందికి ఇంటి పట్టాలు అందించి సీఎం జగన్ చరిత్ర పుటల్లోకి ఎక్కారన్నారు. ప్రతిపక్ష నాయకులు పేదలకు పట్టాలు ఇవ్వకుండా అడ్డుకోవడానికి కుటిల ప్రయత్నాలు చేశారని ఎద్దేవా చేశారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో ప్రతి కుటుంబం తన సొంత కుటుంబంగా భావించి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. అందుకే నవరత్నాలను ప్రతి కుటుంబానికి చేరా వేశారన్నారు. సొంతిల్లు కట్టుకోవాలన్నదే ప్రతి మహిళ కోర్కె, అలాంటి కలను సాకారం చేసి మహిళలకు పెద్దన్నలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. పేద ప్రజల కోసం వలంటీర్లు, సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి అర్హులను గుర్తించి సంక్షేమ పథకాలను ప్రతి ఇంటి తలుపును తట్టేలా చేయడం వైఎస్ జగన్‌కే సాధ్యమన్నారు. విద్యా, వైద్య రంగాల్లో సంస్కరణలు చేసి సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం, విద్యను అందుబాటులోకి తెచ్చామని వివరించారు. స్వాతంత్ర్యం అనంతరం డీకేటీ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయించిన ఘనత వైఎస్ జగన్‌దే అన్నారు. ప్రజారంజకంగా పాలన అందించిన సీఎం వైఎస్ జగన్‌ను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తేనే సంక్షేమ పథకాలు అందుతాయని స్పష్టం చేశారు. అంతకుముందు వైస్ ఎంపీపీ విజయ్ రెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ స్థలం ప్రజలకు ఇచ్చి డీకేటీని రిజిస్ట్రేషన్ చేయడం ఎంతో గొప్పవిషయమని కొనియాడారు. ప్రస్తుతం ఇస్తున్న డీకేటీ పట్టాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. డీకేటీ రిజిస్ట్రేషన్ కావడంతో కొంతకాలం తరువాత అమ్ముకునే సదుపాయం కూడా ప్రభుత్వం హక్కు కల్పించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సి.ఇంద్రాణి, ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సుబ్బరాయుడు, వీరనారాయణ రెడ్డి, ముదిరాజ్ సంఘం రాష్ట్ర డైరెక్టర్ గుండ్లూరు ఈశ్వరయ్య, మండల కో–ఆప్షన్ మెంబర్ మాబాష (లాడెన్), సిద్ధవరం శ్రీనివాసులు రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కె.జయరామయ్య, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

రైల్వేకోడూరు : పట్టణంలోని నూతనంగా నిర్మించిన 50 పడకల సీహెచ్‌సీని సోమవారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పరిశీలించారు. హెల్త్ సెంటర్‌లో మౌలిక వసతులు, సదుపాయాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన, నాణ్యమైన వైద్యాన్ని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చర్యలు చేపట్టారన్నారు. అందులో భాగంగానే ఎన్నో సంవత్సరాలుగా ఎదురుచూసిన 50 పడకల ఆసుపత్రిని అధునాతన సౌకర్యాలతో నిర్మించామన్నారు. వైద్యులు పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, మండల నాగేంద్ర, సీహెచ్ రమేష్, కృష్ణారెడ్డి, రామకృష్ణ, రత్తయ్య, వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


శివరాముడు, తహసీల్దార్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండల నూతన తహసీల్దార్‌గా శివరాముడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో పలు అంశాలపై ఆయన సమీక్షించారు. గతంలో ఇక్కడ పని చేసిన తహసీల్దార్ రామ్మోహన్ రావు తిరుపతికి బదిలీ అయ్యారు.

శాస్త్ర ప్రయోగాల ప్రదర్శన


ప్రాజెక్టులను తిలకిస్తున్న ఉపాధ్యాయులు

రామాపురం : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర హైస్కూల్‌లో సోమవారం విజ్ఞాన శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కరస్పాండెంట్ చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల ప్రదర్శనను నిర్వహించారు. మాట్లాడుతూ 8, 9వ తరగతి విద్యార్థులకు సంబంధించి పరిజ్ఞానాన్ని గుర్తించేందుకు తమ పాఠశాలలో విజ్ఞాన శాస్త్ర ప్రయోగాల ప్రదర్శనను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు న్యామతుల్లా, సుబ్బారెడ్డి, రెడ్డిరాజశేఖర్, వెంకటేశ్వర్లు, శేఖర్‌రెడ్డి, శ్రీలక్ష్మి, శైలజ, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లను పరిశీలించిన కలెక్టర్


ఎస్‌బీవీడీ సభా పాఠశాలను అధికారులతో కలసి పరిశీలిస్తున్న కలెక్టర్ అభిషిక్త్ కిషోర్

పుల్లంపేట : అన్నమయ్య జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సోమవారం పుల్లంపేట మండలంలోని ఏపీ ఆదర్శ పాఠశాల, ఎస్‌బీవీడీ సభా ఉన్నత పాఠశాలలను పరిశీలించారు. త్వరలో ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పాఠశాలలను ఆయన పరిశీలించారు. ఎన్నికలు నిర్వహించే పోలింగ్ బూత్‌లలో అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో రాజంపేట ఆర్డీఓ మోహన్ రావు, పుల్లంపేట తహసీల్దార్ వెంకటనారాయణ, ఆర్ఐ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు

రైల్వేకోడూరు అర్బన్ : త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సోమవారం తెలిపారు. ఆయన రైల్వేకోడూరులో పర్యటించి అనంతరాజుపేటలోని లాకర్ రూమ్‌ను పరిశీలించి అధికారులకు తగిన సూచనలు, సలహాలు చేశారు. అలాగే ఎన్నికల అధికారులు, రెవెన్యూ అధికారులతో ఆయన సమీక్షలు జరిపారు.

వైద్య రంగానికి జగన్ ప్రభుత్వం పెద్దపీట


రాజంపేట రూరల్: బ్రహ్మోత్సవ పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న మేడా సోదరులు


రాజంపేట టౌన్: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

రాజంపేట టౌన్ : రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి, రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఈడిగపాళెంలో రూ.80 లక్షల వ్యయంతో నిర్మించిన ఆయుష్మాన్ భారత్ డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం వారు ప్రారంభించి మాట్లాడారు. మనిషికి ఆరోగ్యం వెలకట్టలేని సంపద అన్నారు. అందువల్లే సీఎం వైద్యరంగానికి పెద్దపీట వేసి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితులను తెలుసుకొని అందుకు అనుగుణంగా వైద్య సేవలు అందించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా జగనన్న సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నారన్నారు. జగన్ గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేశారని తెలిపారు. అలాగే రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు జగన్‌కు మద్దతుగా నిలిచి గెలిపించాలని కోరారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో ప్రతిపక్ష పార్టీలు ప్రజలను మోసగించేందుకు ఇప్పటి నుంచే మాయమాటలు చెబుతున్నారని తెలియజేశారు. ప్రజలు ప్రతిపక్షాల కుట్రలను ఓటుతో తిప్పికొట్టాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ చెన్నకృష్ణ, వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జెనుగు కృష్ణారావుయాదవ్, జేసీఎస్ పట్టణ ఇన్‌ఛార్జ్ వడ్డే రమణ, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ మహిళా ఇన్‌ఛార్జ్ మిర్యాల సురేఖ, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు తదితరులు పాల్గొన్నారు.

త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవ పోస్టర్‌లు విడుదల

రాజంపేట రూరల్ : ప్రముఖ శైవ పుణ్యక్షేత్రమైన శ్రీ కామాక్షి సమేత త్రేతేశ్వరస్వామి బ్రహ్మోత్సవ వాల్‌పోస్టర్‌లను రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డిలు ఆవిష్కరించారు. స్థానిక మేడా భవన్‌కు దేవదాయశాఖ అధికారి జి.కొండారెడ్డి, దేవస్థాన కమిటీ చైర్మన్ వి.వెంకటసుబ్బారెడ్డిలు కమిటీ సభ్యులతో కలిసి సోమవారం విచ్చేశారు. ఆవిష్కరణ అనంతరం మేడా సోదరులు మాట్లాడుతూ స్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మేడా సోదరులకు సన్మానం

రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డిలను శ్రీశైల దేవస్థానం పాలక మండలి సభ్యులు బొల్లినేని రామ్మోహన్‌నాయుడు శాలువాతో సన్మానం చేసి పూల బొకే ఇచ్చి కృతజ్ఞతలు తెలియజేశారు.

పేదలకు అండగా సీఎం సహాయనిధి

ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు అండగా నిలుస్తోందని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథరెడ్డి అన్నారు. స్థానిక మేడా భవన్‌లో ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డితో కలసి రఘునాథరెడ్డి లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేశారు. రాజంపేట పట్టణం మన్నూరుకు చెందిన నారదాసు మనికి రూ.2లక్షలు, టి.సుండిపల్లి మండలానికి చెందిన వై.వెంకటరమణకు రూ.1లక్ష, టి.సుండుపల్లి మండలం మడితాడు గ్రామానికి చెందిన ఎస్.జయమ్మకు రూ.70వేలు విలువ గల చెక్కులను అందజేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి


విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు(రాజంపేట) : విద్యార్థులు చదువుతో పాటు క్రీడా, సాంస్కృతిక రంగాలలో రాణించాలని జ్ఞానదీప్తి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మమ్మ, శ్రీ అన్నమాచార్య అకాడమీ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సమ్మెట శివప్రసాద్‌లు అన్నారు. సోమవారం స్థానిక పాఠశాలలో వేదిక్ మ్యాథ్స్, అబాకస్ జోనల్ లెవల్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు. ఆదివారం కడపలో నిర్వహించిన ఈ జోనల్ లెవల్ పోటీలలో దాదాపు 40 పాఠశాలల విద్యార్థులు పాల్గొనగా అందులో జ్ఞానదీప్తి పాఠశాలకు చెందిన ఎనిమిది మంది, శ్రీ అన్నమాచార్య అకాడమీకి చెందిన ఎనిమిది మంది విద్యార్థులు ఈ పోటీల్లో నిల్వగా అందులో అబాకస్‌లో జ్ఞానదీప్తి విద్యార్థులు మహమ్మద్ అబ్దుల్లా, మోక్షిత మాన్వి, హార్తిక రెడ్డి, సాయి మాధవ్, గీత శ్రీలు మొదటి బహుమతి గెలుపొందారు. వేదిక్ మ్యాథ్స్‌లో చరిత మొదటి బహుమతి, సుమిత్ర రెండవ బహుమతి గెలుపొందారు. అన్నమాచార్య అకాడమీ విద్యార్థులు ఎస్.జోయా మెహెక్ మ్యాథ్స్‌లో రెండవ బహుమతి, ఎం.యశ్వంత్ కుమార్ అబాకస్‌లో మూడో బహుమతి గెలుపొందారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించండి


సమస్యలను వివరిస్తున్న సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రైతుల రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్‌రెడ్డి తహసీల్దార్ శేషగిరిరావును కోరారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో సాయికిషోర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన రైతుల సమస్యలను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందులో ప్రధానంగా ఆన్‌లైన్‌కు సంబంధించి, భూముల సర్వే, భూముల సమస్యల అర్జీలను తహసీల్దార్ శేషగిరిరావుకు అందజేశారు. ఇందుకు ఆయన మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం కోర్లకుంట పంచాయతీ కొత్తపల్లె హరిజనవాడ గ్రామం సమీపంలో నిర్మిస్తున్న నూతన కల్వర్టు పనులను సాయికిషోర్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రేడ్ యూనియన్ నాయకులు అక్కిరెడ్డి మధురెడ్డి, సర్పంచ నరేంద్రరాజు, ఉప సర్పంచ్ ముక్కా రూపేష్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారులకు ఉచిత భోజనం


అర్జీదారులకు భోజనం వడ్డిస్తున్న కార్యకర్తలు

రాయచోటి టౌన్ : జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చే అర్జీదారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఉచితంగా భోజనం అందించారు. ప్రతి సోమవారం జిల్లా కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని నియోజకవర్గాల నుంచి తమ సమస్యలను ఫిర్యాదుల ద్వారా తెలియజేసేందుకు వస్తారు. అలాంటి వారి ఆకలి తీర్చేందుకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తన సొంత నిధులతో ఉచితంగా భోజన వసతి కల్పించారు.

పల్స్ పోలియో విజయవంతం


పోలియో చుక్కలు వేస్తున్న ఎంపీపీ మేడా

నందలూరు(రాజంపేట) : మండలంలో 48 పల్స్ పోలియో కేంద్రాలలో ఒక మొబైల్ టీమ్ ద్వారా మొదటి రోజు 3849 మంది ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేసి 99 శాతం సాధించామని వైద్యులు డాక్టర్ కె.శరత్ కమల్, డి కార్తీక్, విశ్వనాథ్‌లు తెలిపారు. సోమవారం రెండో రోజు వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి 128 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేశారు. మొత్తం 3977 మంది మందికి పల్స్ పోలియో చుక్కలను మండలంలో వేసి 103శాతం సాధించామని వారు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు అన్నం నాగేంద్ర మూర్తి, సర్పంచ్ సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ యువనాయకుడు గుణ యాదవ్, సీహెచ్‌ఓ వెంకట నారాయణ, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

నివాళి

మండలంలోని పాటూరు గ్రామ పంచాయతీ నడీకోటకు చెందిన చింతమాను చంద్రమోహన్ కుమార్తె శ్రీ విద్య ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎంపీపీ మేడా విజయభాస్కర్ రెడ్డి మృతురాలి స్వగ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యాన్ని తెలిపారు.

మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలి


ఉత్సవాల నిర్వహణపై సమీక్షిస్తున్న తహసీల్దార్

సిద్దవటం : వంతాటిపల్లి గ్రామ సమీపంలోని లంకమల అడవుల్లో వెలసిన నిత్యపూజ స్వామి కోనలో ఈ నెల 7, 8, 9 తేదీలలో జరిగే మహాశివరాత్రి ఉత్సవాలను జయప్రదం చేయాలని తహసీల్దారు మురాషావలి తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో సోమవారం శివరాత్రి ఉత్సవాల నిర్వహణపై వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ ఉత్సవాల్లో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం, వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దారు మాధవీలత, ఆర్ఐ అనూరాధ, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

ఏఐటీఎస్‌లో నేషనల్ సేఫ్టీ డే


విద్యార్థులను అభినందిస్తున్న చొప్పా ఎల్లారెడ్డి

రాజంపేట : బోయనపల్లిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో నేషనల్ సేఫ్టీ డేను సోమవారం ఘనంగా జరిపారు. ఇందులో భాగంగా టచ్ స్టోన్ వారు పని–భద్రత, ప్రమాద నివారణ చర్యలపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో సి.శాంతిశ్రీ, మొదటి బహుమతి, జి.నాగహర్షిత రెండో బహుమతి, ఎస్.యశ్విత మూడో బహుమతిని గెలుచుకున్నారు. విజేతలకు కళాశాల వైస్ చైర్మన్ చొప్పా ఎల్లారెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ఎంవి నారాయణలు బహుమతులు అందించి అభినందించారు.

భూ ఆక్రమణలను అడ్డుకున్న అధికారులు


బోర్డును ఏర్పాటు చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

సంబేపల్లె : మండలంలోని ఎస్.సోమవరం గ్రామం , గుట్టపల్లి గ్రామంలో టీడీపీ నాయకులు, అగ్రవర్ణ కులాల వారు భూములు ఆక్రమిస్తున్నారని సర్పంచ్‌లు చిదంబర్ రెడ్డి, అనుసూయమ్మలు సోమవారం జిల్లా కలెక్టర్‌కు, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదులో గ్రామాలలోని సర్వేనెంబరు. 207, 209లలో దాదాపు 32 ఎకరాలు టీడీపీ నాయకులు ఆక్రమించుకున్నారని అధికారుల దృష్టి తీసుకెళ్లారు. సోమవారం జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సంబేపల్లె తహసీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది ఫిర్యాదు చేసిన సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి బోర్డును ఏర్పాటు చేశారు. అయితే అదే గ్రామంలో ఓ మహిళా రైతు రెండు ఎకరాలు చదును చేసుకుంటూ ఉంటే ఎల్లో మీడియా వైఎస్సార్‌సీపీ నాయకులు భూమిని ఆక్రమించుకున్నారని ప్రచురించడం హాస్యాస్పదమన్నారు.

జాబ్ మేళాలో 139 మంది ఎంపిక

పీలేరు రూరల్ : స్థానిక ప్రభుత్వ సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో 139 మంది అభ్యర్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన ఇంటర్వ్యూల్లో డిగ్రీ, పీజీ అర్హత కల్గిన అభ్యర్థులు సుమారు 400 మంది హాజరైనట్లు తెలిపారు. పేటీఎం, బిగ్‌సీ, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో ఫార్మసీ, యంగ్ ఇండియా, టాటా ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి 139 మందిని ఎంపిక చేసినట్లు పేర్కొ న్నారు. ఎంపికైన వారికి నెలకు రూ. 18,500 వేతనం అందుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ డాక్టర్ రాజశేఖర్, జి. కృష్ణమూర్తి, డాక్టర్ కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

పీలేరు బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పీలేరు : పీలేరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం స్థానిక కోర్టు ఆవరణలో నూతన కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బి.సి. పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఎ.నరసింహారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్, జాయింట్ సెక్రటరీ పి. నాగభూషణం, ట్రెజరర్‌గా శేషాద్రి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా నిరంజన్‌కుమార్, లైబ్రరీ సెక్రటరీగా పూజారి యల్లయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అవగాహనతో క్షయను నిర్మూలిద్దాం

నిమ్మనపల్లె : అవగాహనతో క్షయ వ్యాధిని నిర్మూలిద్దామని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రమేష్‌బాబు పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని రెడ్డివారిపల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులకు వాల్మీకిపురం టీబీ యూనిట్ అధికారులతో కలిసి క్షయవ్యాధి వ్యాప్తి, నివారణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ వ్యాధిని నిర్లక్ష్యం చేయకూడదని తెలిపారు. క్షయ వ్యాధి (టీబీ) సోకిన వారిలో అలసట, తలనొప్పి, బరువు తగ్గడం, ఆకలి మందగించడం, శ్వాసకోశ సమస్యలు వంటి లక్షణాలు కనపడుతాయని తెలిపారు. టీబీని నివారించడానికి డాట్స్ చికిత్స అందుబాటులో ఉందన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాల్లో ప్రాణాలను రక్షించేదే 'హెల్మెట్'


ద్విచక్రవాహనదారులకు హెల్మెట్ ధరింపజేస్తున్న ట్రాఫిక్ సీఐ మహబూబ్‌బాషా

రాయచోటి టౌన్ : హెల్మెట్ పెట్టుకో.. సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకో అనే నినాదంతో రాయచోటి ట్రాఫిక్ సీఐ మహబూబ్ బాషా వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. సోమవారం రాయచోటి పట్టణం మదనపల్లె రోడ్డులోని సర్కిల్ వద్ద ద్విచక్ర వాహనదారులను ఆపి రికార్డులు లేకపోయినా పర్వాలేదు కానీ హెల్మెట్ తప్పకుండా ధరించి వాహనాలు నడపాలని సూచించారు. అలా కాకుండా వెళ్లాలనుకొంటే ప్రమాదమని తెలియజేశారు. ద్విచక్ర వాహనదారులు అనుకోని సంఘటనలలో హెల్మెట్ ధరించకపోవడం వలన ప్రాణాలను కోల్పోవాల్సిన పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. అలాగే 4 వీలర్ వాహనదారులు సీట్ బెల్ట్ తప్పకుండా ధరించాలని సూచించారు. అనంతరం హెల్మెట్‌లు తీసుకొచ్చి కట్టాల్సిన జరిమానాకు బదులుగా హెల్మెట్‌లు కొనిపించారు.